
TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 86 | హైదరాబాద్ | సోమవారం | 14-09-2026 | పేజీలు: 08



## పోలీస్ కస్టడీకి మాజీ హవిల్దార్ మల్లేశ్

- బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం
- సికింద్రాబాద్ కోర్టులో పోలీసులకు అనుకూల తీర్పు
- ఎల్లుండి నుంచి కస్టడీలోకి మల్లేశ్
- మరికొందరినీ విచారించనున్న దర్యాప్తు అధికారులు
- చోరీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా
- ఆయుధాలను ఎవరికి అప్పగించాలనుకున్నాడో విచారణ
- మల్లేశ్ వెల్లడించే వివరాలపై పోలీసుల దృష్టి

# రోశయ్య దూరదృష్టితోనే తెలంగాణకు మిగులు బడ్జెట్

- రోశయ్య సేవలను గుర్తుచేసుకున్న రేవంత్
- ఆర్థికమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగారని వెల్లడి
- తెలంగాణ మిగులు బడ్జెట్‌కు ఆయన దూరదృష్టే కారణమని వ్యాఖ్య
- తన రాజకీయ ప్రస్థానంపై రోశయ్యకు ముందుచూపు ఉందన్న సీఎం
- ఆవేశానికి ఆలోచన తోడవ్వాలని సూచించేవారని గుర్తు చేసుకున్న రేవంత్
- రోశయ్య విమర్శించేవారు.. దూషించేవారు కాదని ప్రశంస
- హైదరాబాద్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని వెల్లడి
- రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఆర్యవైశ్యుల ఆర్థిక క్రమశిక్షణను కొనియాడిన సీఎం
- రాజకీయాల్లో తమ వాటా సాధించుకోవాలని పిలుపు
- ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య భవనానికి శంకుస్థాపన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

మాజీ సీఎం, సీనియర్ నేత కొణిజేటి రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆత్మగౌరవ భవనం కేవలం అగర్భ శ్రీమంతులకే పరిమితం కాకూడదని రేవంత్‌రెడ్డి అన్నారు. పేద ఆర్యవైశ్యుల పిల్లలకు కూడా ఈ భవనం ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. భవనం భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నిర్మించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా దీనిని తీర్చిదిద్దాలని అన్నారు.

**రోశయ్యతో అనుబంధం**

తన రాజకీయ జీవితంలో రోశయ్య ఇచ్చిన సలహాలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. గతంలో సీఎంలు ఎంతమంది మారినా రోశయ్య సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆర్థిక అంశాలపై ఆయనకు ఉన్న అవగాహన, దూరదృష్టిని కొనియాడారు. తెలంగాణకు మిగులు బడ్జెట్ రావడంలో ఆయన మిగతా 2 లో..



## రూల్స్ పాటించడం కాదు.. రూల్స్ సెట్ చేయాలి

- బ్రిక్స్ నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ
- గ్లోబల్ సౌత్ తీరుపై మోదీ కీలక వ్యాఖ్యలు
- నిబంధనలు పాటించేవిగా కాక.. రూపొందించేవిగా ఎదగాలి
- భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని వ్యాఖ్య
- ప్రపంచ ఘర్షణల ప్రభావం సామాన్యులపై పడుతోందన్న ప్రధాని
- సవాళ్లను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచన
- అంటువ్యాధుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై ఏకాభిప్రాయం
- బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌కు మోదీ ప్రతిపాదన
- సాంకేతికత, ఖనిజాలతో బెదిరింపులను వ్యతిరేకించాలని పిలుపు
- జిన్‌పింగ్ సమక్షంలో అరుదైన ఖనిజాలపై కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

ప్రపంచ సంక్షోభాల విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలోనే ఉంటున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ దేశాలు నిబంధనలు పాటించేవిగానే కాకుండా.. ప్రపంచానికి నిబంధనలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న బ్రిక్స్ వార్షిక సదస్సులో మోదీ మాట్లాడారు.

ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు నిరంతరం పెరుగుతున్నాయని ప్రధాని మిగతా 2 లో..



## టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్

- రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ వర్క్‌షాప్ ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- టిమ్స్‌లో అత్యాధునిక రోబోటిక్ పరికరాల పరిశీలన
- మౌలిక వసతులపై నిపుణులతో మంత్రి చర్చ
- రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణపై దృష్టి
- వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం
- ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం
- తెలంగాణ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం
- ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం
- కార్యక్రమంలో వైద్య శాఖ ఉన్నతాధికారులు, నిపుణులు

## ఒకే ఫ్రేమ్‌లో మోదీ.. పుతిన్.. జిన్‌పింగ్

- బ్రిక్స్ వేదికపై ఆసక్తికర దృశ్యం
- ఫ్యామిలీ ఫొటోకు నేతల పోజులు
- మధ్యలో ప్రధాని మోదీ ఇరువైపులా పుతిన్, జిన్‌పింగ్
- నవ్వుతూ కెమెరాలకు పోజులు
- సోషల్ మీడియాలో వైరల్‌గా ఫొటో
- అంతర్జాతీయ మీడియాలోనూ ప్రత్యేక ప్రాధాన్యం
- వరుసగా మూడోసారి ఒకే వేదికపై ముగ్గురు నేతలు
- భారత్-రష్యా-చైనా సంబంధాలకు ప్రతిబింబంగా చిత్రం
- జిన్‌పింగ్ భారత్ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం



**ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ఆసక్తికర దృశ్యం కనిపించింది. బ్రిక్స్ దేశాల అధినేతలు తీసుకున్న 'ఫ్యామిలీ ఫొటో' సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్ మండపంలో జరిగిన ఈ ఫొటో సెషన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మధ్యలో నిలవగా.. ఆయనకు ఇరువైపులా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిలబడి కెమెరాలకు పోజులిచ్చారు. ముగ్గురు నేతలు పక్కపక్కనే నిలబడి నవ్వుతూ ఫొటోకు పోజివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్, రష్యా, చైనా మధ్య ఉన్న కీలక దౌత్య సంబంధాలను ప్రతిబింబించే చిత్రంగా ఈ ఫొటో అంతర్జాతీయ మీడియాలోనూ ప్రాధాన్యం పొందింది.

**వరుసగా మూడోసారి..**

మోదీ, పుతిన్, జిన్‌పింగ్ ముగ్గురూ వరుసగా మూడోసారి బ్రిక్స్ వేదికపై కనిపించడం మరో విశేషం. 2024లో రష్యాలోని మిగతా 2లో..

## కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- కాంగ్రెస్ నేత కొండా మురళి కీలక ప్రకటన
- సురేఖ గెలుపులో రాహుల్ పాత్ర ఉందని వెల్లడి
- పదవులు వస్తాయి.. పోతాయని వ్యాఖ్య
- మాట కోసం నిలబడతామని స్పష్టీకరణ
- సురేఖకు సారీ చెప్పాలని సూచించారని వెల్లడి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత తొలిసారిగా కొండా దంపతులు వరంగల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తమ కుటుంబానికి ఉన్న అభిమానాన్ని, కాంగ్రెస్ పార్టీతో తమ అనుబంధాన్ని స్పష్టం చేశారు.

కొండా సురేఖను ఎన్నికల్లో గెలిపించడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మురళి అన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం మిగతా 2లో..

## ముంబయిలో ట్రాఫిక్ నరకం.. గడ్కరీకి తప్పని ఆలస్యం

- గంట ఆలస్యంగా కార్యక్రమానికి గడ్కరీ
- వర్లీ నుంచి బయల్దేరినా ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి
- ముంబయి రోడ్ల పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి
- దశాబ్దాల నాటి మౌలిక సదుపాయాలే సమస్య
- 1995-2000లో 55 ఫ్లైఓవర్ల నిర్మాణం
- బాంద్రా-వర్లీ సీ లింక్ నిర్మాణంలో కీలక పాత్ర
- ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేకు గడ్కరీ ప్రస్తావన
- పాత ఫ్లైఓవర్ల స్థానంలో ఆధునిక నిర్మాణాలు
- బహుళస్థాయి ఫ్లైఓవర్లకు మలేషియా సాంకేతికత
- భారత్ సామర్థ్యాలకు అమెరికా వనరుల జోడింపు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ముంబయి రోడ్ల పరిస్థితి, పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎంతగా ఉందో తన అనుభవంతోనే చెప్పకనే చెప్పారు. వర్లీ నుంచి బయల్దేరినప్పటికీ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఓ కార్యక్రమానికి ఏకంగా గంట ఆలస్యంగా చేరుకున్నారు.

ముంబయిలో ఇండోఅమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం నిర్వహించిన 22వ ఇండోఅమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి గడ్కరీ హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చినందుకు అక్కడి వారికి క్షమాపణలు చెప్పారు. ముందుగానే బయల్దేరినప్పటికీ ట్రాఫిక్ కారణంగానే ఆలస్యమైందని వివరించారు. తాను చేసిన తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నానంటూ చమత్కరించడంతో కార్యక్రమంలో మిగతా 2లో..





## అనంత్ అంబానీ విరాళం.. తిరుమలకు చేరిన 15 ఎలక్ట్రిక్ బస్సులు

- టీటీడీకి మొత్తం 25 బస్సుల విరాళం
- ఇప్పటికే తిరుమలకు చేరిన 15 బస్సులు
- రూ.27.5 కోట్ల విలువైన బస్సులు
- 50 మంది డ్రైవర్లను అందించనున్న రిలయన్స్
- ఛార్జింగ్ స్టేషన్ కూడా ఏర్పాటు
- జూన్‌లో విరాళాన్ని ప్రకటించిన అనంత్ అంబానీ
- బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సేవలు
- ఈనెల 16న బస్సుల ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- భారత్ బయోటెక్ నుంచి మరో 7 బస్సులు



**తిరుమల, (ప్రజాక్షేత్రం):**

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేలా తితిదేకు మరో కీలక సహకారం అందుతోంది. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన 25 ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సుల్లో 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నాయి. మిగిలిన బస్సులు కూడా మిగతా 2లో..

# ఒకే ఫ్రేమ్‌లో మోదీ.. పుతిన్.. జిన్‌పింగ్

మొదటిపేజీ తరువాయి

కజాన్‌లో, 2025లో చైనాలోని తియాంజిన్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశాల తర్వాత తాజాగా న్యూఢిల్లీలో వీరు మరోసారి భేటీ అయ్యారు.

**జిన్‌పింగ్ పర్యటనపై ఆసక్తి**

ఈసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 తర్వాత ఆయన తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్నారు. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్‌చైనా సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఇరువైపులా ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఆయన పర్యటన సాగుతోంది.

# రోశయ్య దూరదృష్టితోనే తెలంగాణకు మిగులు బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

దూరదృష్టి కీలకమని పేర్కొన్నారు.

తాను రాజకీయాల్లో సుదీర్ఘకాలం రాణిస్తానని రోశయ్య ముందుగానే గుర్తించారని రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీలో తాను దూకుడుగా మాట్లాడుతున్నప్పుడు ఆవేశాన్ని తగ్గించుకోవాలని రోశయ్య సూచించేవారని తెలిపారు. *ఆవేశానికి ఆలోచన తోడైతేనే భవిష్యత్ ఉంటుందని* ఆయన సలహా ఇచ్చేవారని గుర్తుచేశారు.

**విమర్శించేవారు.. దూషించేవారు కాదు**

రోశయ్య రాజకీయ ప్రత్యర్థులను విమర్శించేవారని, అయితే వ్యక్తిగతంగా దూషించేవారు కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో హుందాతనం, సంయమనం పాటించేవారని గుర్తుచేశారు. ఆయన నుంచి తాను అనేక విషయాలు నేర్చుకున్నానని తెలిపారు.

హైదరాబాద్‌తో తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య తరచూ చెప్పేవారని సీఎం పేర్కొన్నారు. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్‌తో రోశయ్యకు ఉన్న అనుబంధాన్ని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఆర్థిక క్రమశిక్షణ**

ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సలహాలు అవసరమైనప్పుడు ఆర్యవైశ్యులను సంప్రదిస్తారని అన్నారు. సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగినవారిగా ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. పేదరికం ఎదురైనా తమ బాధలను బయటకు చెప్పకుండా కడుపులో దాచుకునే స్వభావం ఆర్యవైశ్యుల్లో ఉందని సీఎం పేర్కొన్నారు. సమాజంలోని పేదల సంక్షేమం, వారి భవిష్యత్‌కు ఆత్మగౌరవ భవనం ఉపయోగపడేలా చూడాలని సూచించారు.

**రాజకీయాల్లో వాటా సాధించాలి**

ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి రాజకీయాల్లో తమ వాటాను సాధించుకోవాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధితో పాటు రాజకీయ ప్రాతినిధ్యం కూడా అవసరమని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాజకీయాల్లో మరింత బలమైన ప్రాతినిధ్యం సాధించవచ్చని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం నిర్మాణం కేవలం ఒక భవనం ఏర్పాటు చేయడం కాదని.. భవిష్యత్ తరాలకు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు.



# పోలీస్ కస్టడీకి మాజీ హవిల్దార్ మల్లేశ్

- **బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం**
- **సికింద్రాబాద్ కోర్టులో పోలీసులకు అనుకూల తీర్పు**
- **ఎల్లుండి నుంచి కస్టడీలోకి మల్లేశ్**
- **మరికొందరినీ విచారించనున్న దర్యాప్తు అధికారులు**
- **చోరీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా**
- **ఆయుధాలను ఎవరికి అప్పగించాలనుకున్నాడో విచారణ**
- **మల్లేశ్ వెల్లడించే వివరాలపై పోలీసుల దృష్టి**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

బొల్లారంలోని ఆర్మీ మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ హవిల్దార్ మల్లేశ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు సికింద్రాబాద్ కోర్టు అనుమతించింది. ఎల్లుండి నుంచి మల్లేశ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు.

కస్టడీలో భాగంగా మల్లేశ్‌ను ఆయుధాల చోరీకి సంబంధించిన కీలక అంశాలపై పోలీసులు ప్రశ్నించనున్నారు. చోరీ వెనుక ఉన్న నెట్‌వర్క్, ఇతర వ్యక్తుల ప్రమేయం, ఆయుధాల తరలింపు వంటి అంశాలపై వివరాలు సేకరించనున్నారు. మల్లేశ్‌తో పాటు కేసుతో సంబంధం ఉన్న మరికొందరినీ పోలీసులు విచారించే అవకాశం ఉంది.

**ఆయుధాలు ఎవరికి?**

ఆర్మీ రెజిమెంట్ నుంచి చోరీ చేసిన ఆయుధాలను మల్లేశ్ ఎవరికి అప్పగించాలనుకున్నాడనే అంశంపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఆయుధాల చోరీకి ముందు, తర్వాత ఎవరెవరితో సంబంధాలు కొనసాగించాడు? ఎవరితో సంప్రదింపులు జరిపాడు? ఆయుధాలను ఎక్కడికి తరలించాలనుకున్నాడు? అనే కోణాల్లో దర్యాప్తు చేయనున్నారు.

మల్లేశ్ వెల్లడించే వివరాలు కేసు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది. ఆయన చెప్పే సమాచారాన్ని ఇతర ఆధారాలతో సరిపోల్చి పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించనున్నారు.

**ఎన్ఐఏకు సమాచారం**

ఆయుధాల చోరీ వెనుక ఉన్న నెట్‌వర్క్‌కు సంబంధించి మల్లేశ్ నుంచి లభించే కీలక వివరాలను ఎన్ఐఏకు రాష్ట్ర పోలీసులు అందించనున్నారు. చోరీ చేసిన ఆయుధాల వెనుక ఉన్న ఉద్దేశం, వాటి వినియోగం, ఇతర వ్యక్తుల ప్రమేయం వంటి అంశాలపై కేంద్ర దర్యాప్తు సంస్థకు సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మల్లేశ్ కస్టడీ విచారణతో కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆయుధాల చోరీ వెనుక అసలు నెట్‌వర్క్ ఎవరిదనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు.

# రూల్స్ పాటించడం కాదు.. రూల్స్ సెట్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

అన్నారు. వాటి ప్రభావం సామాన్యుల జీవితాలపై పడుతోందని పేర్కొన్నారు. ఎదురయ్యే సవాళ్లను సకాలంలో గుర్తించి.. వాటిపై ముందుగానే చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ దిశగా బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**అంటువ్యాధులపై ముందస్తు వ్యవస్థ**

అంటువ్యాధుల విషయంలో ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశంపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని మోదీ తెలిపారు. పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలు మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి లక్ష్యాలను సాధించే క్రమంలో పర్యావరణానికి ఇబ్బంది కలిగించకూడదని అన్నారు.

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా చూడకూడదని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ నాగరికత ఎప్పటినుంచో ప్రకృతిని తల్లిగా భావిస్తూ.. మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటిస్తోందని వివరించారు. భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను ఇది తెలియజేస్తోందన్నారు.

**బ్రిక్స్ స్టార్టప్ ఫండ్**

బ్రిక్స్ దేశాలన్నీ కలిసి *'బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్'* ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు. ప్రత్యేక స్టార్టప్ నిధి అందుబాటులో ఉంటే బ్రిక్స్ దేశాల్లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తల మధ్య సహకారం మరింత పెరుగుతుందని అన్నారు.

కొత్త ఆలోచనలు, సాంకేతికత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ తరహా సహకారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఉన్న భిన్నత్వాన్ని బలంగా మలచుకుని.. సమష్టి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**జిన్‌పింగ్ సమక్షంలో**

**అరుదైన ఖనిజాలపై వ్యాఖ్యలు**

సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను ఉపయోగించుకుని ఇతర దేశాలను బెదిరించే చర్యలను వ్యతిరేకించాలని మోదీ పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని అన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచంలోని అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్‌లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్ల వరకు అనేక కీలక ఉత్పత్తుల తయారీలో ఈ ఖనిజాలు అవసరమవుతున్నాయి. గతంలో అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా అరుదైన ఖనిజాల ఎగుమతులపై నిబంధనలను కఠినతరం చేసింది. అనంతరం కొన్ని ఆంక్షలను సడలించింది.

ఈ నేపథ్యంలో సాంకేతికత, కీలక ఖనిజాల సరఫరా విషయంలో ఏకపక్ష ఆధిపత్యానికి వ్యతిరేకంగా మోదీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్

- **రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ వర్క్‌షాప్ ప్రారంభం**
- **ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ**
- **టిమ్స్‌లో అత్యాధునిక రోబోటిక్ పరికరాల పరిశీలన**
- **మౌలిక వసతులపై నిపుణులతో మంత్రి చర్చ**
- **రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణపై దృష్టి**
- **వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం**
- **ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం**
- **తెలంగాణ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం**
- **ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం**
- **కార్యక్రమంలో వైద్య శాఖ ఉన్నతాధికారులు, నిపుణులు**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం టిమ్స్‌కు చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ పరికరాలు, మౌలిక వసతులను పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై మంత్రి చర్చించారు. రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతికతతో వైద్యం**

తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు రాజనర్సింహ తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రోబోటిక్ సర్జరీ వంటి అధునాతన విధానాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**వైద్య నిపుణుల హాజరు**

ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

మొదటిపేజీ తరువాయి

కాదని.. ఇవాళ ఉండి రేపు పోవచ్చని వ్యాఖ్యానించారు. అయితే ఇచ్చిన మాటకు మాత్రం తాము కట్టుబడి ఉంటామని చెప్పారు.

**పదవి కోసం రాజీపడలేదు**

కృతజ్ఞత అనేది తమ రక్తంలోనే ఉందని, తమ కుటుంబంలో ఆ విలువలు ఉన్నాయని కొండా మురళి అన్నారు. కొండా సురేఖతో సారీ చెప్పించాలని సూచించారని తెలిపారు. అయితే పదవి కోసం క్షమాపణ చెప్పేందుకు ఆమె అంగీకరించలేదన్నారు.

*"పదవి ఉంటే ఉండనీ.. పోతే పోనీ"* అనే వైఖరితో సురేఖ సారీ చెప్పలేదని మురళి పేర్కొన్నారు. రాజకీయాల్లో పదవుల కంటే ఆత్మగౌరవం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు.

**ఎలా బతికామన్నదే ముఖ్యం**

జీవితంలో ఎన్ని రోజులు బతికామన్నది కాదని.. ఎలా బతికామన్నదే ముఖ్యమని కొండా మురళి అన్నారు. పదవుల కోసం తమ సిద్ధాంతాలను, మాటను మార్చుకునే ప్రసక్తి లేదని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తమ అనుబంధం కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేసిన మురళి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ రాజకీయ లక్ష్యమని కార్యకర్తల సమావేశంలో వెల్లడించారు.

# ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో "సివిల్ కోడ్"..

- **2029 లోగా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీ..**
- **ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి చట్టాలు..**
- **ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తాం.**
- **అక్రమ వలసదారుల్ని గుర్తించి, తొలగిస్తాము..**
- **కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు..**

ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):

దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలుపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. 2029లోగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీ అమలు చేస్తామని ఆయన అన్నారు. ఆదివారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత అంశాలకు ఒకే రకమైన చట్టపరమైన నిబంధనలు వర్తింపచేయాలనే ఉద్దేశంతో బీజేపీ "ఉమ్మడి పౌరస్మృతి"ని తీసుకువస్తోంది.

ఇప్పటికే పలు బీజేపీ రాష్ట్రాలు యూసీసీ చట్టాలు చేశాయి. మిగిలిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో కూడా దీనిని తీసుకువస్తామని అమిత్ షా ప్రకటించారు. దేశ భద్రతను ప్రస్తావిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదంపై బీజేపీ ప్రభుత్వం "జీరో టాలరెన్స్" విధానాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. అన్ని రంగాల్లో భద్రతకు అధిక ప్రధానత్య ఇస్తున్నట్లు చెప్పారు. అక్రమ వలసదారుల్ని గుర్తించి, ఏరివేస్తామని చెప్పారు.

2014కు ముందు దేశం అవినీతి, కులతత్వం, కుటుంబ రాజకీయాల వల్ల ప్రభావితమైందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనితీరు ఆధారంగా రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు. 'ఇండియా ఫస్ట్' అనే విధానం ద్వారా భారత విదేశాంగ, రక్షణ విధానాలకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు. ఒకప్పుడు "ఫ్రాజైల్ ఫైవ్" ఆర్థిక వ్యవస్థగా చూసిన భారత్, ఇప్పుడు ప్రపంచంలోనే టాప్5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా చేరిందని అన్నారు. మణిపూర్‌లో ఎన్ఆర్సీ అమలుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు అమిత్ షా ప్రకటించారు. మోడీ పుట్టిన రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై మాట్లాడుతూ.. భారత ప్రజస్వామ్య దేశమని, ప్రజలు నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవిస్తుందని అమిత్ షా అన్నారు.



# అనంత్ అంబానీ విరాళం.. తిరుమలకు చేరిన 15 ఎలక్ట్రిక్ బస్సులు

మొదటిపేజీ తరువాయి

త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ఈ ఏడాది జూన్‌లో అనంత్ అంబానీ తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తితిదేకు రూ.27.5 కోట్ల విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. బస్సులకు అవసరమైన 50 మంది డ్రైవర్లతో పాటు ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా రిలయన్స్ సంస్థ అందించనుంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం ఈ బస్సులను ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు. ధర్మరథం సేవల్లో భాగంగా ఈ ఎలక్ట్రిక్ బస్సులు భక్తులకు ఉపయోగపడనున్నాయి.

ఇదిలా ఉండగా.. భారత్ బయోటెక్ సంస్థ కూడా తితిదేకు ఏడు ఎలక్ట్రిక్ బస్సులను అందించనుంది. రిలయన్స్, భారత్ బయోటెక్ సంస్థలు అందించే మొత్తం బస్సులు అందుబాటులోకి వస్తే తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సౌకర్యం మరింత విస్తరించనుంది. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో సామాన్య భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది.

# ముంబయి లో ట్రాఫిక్ నరకం.. గడ్కరీకి తప్పని ఆలస్యం

మొదటిపేజీ తరువాయి

నవ్వులు విరిశాయి.

**అప్పట్లో నిర్మించినవే.. ఇప్పుడు సమస్యగా**

19952000 మధ్య మహారాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేసిన విషయాన్ని గడ్కరీ గుర్తుచేశారు. ఆ సమయంలో 55 ఫ్లైఓవర్లు, బాంద్రావర్లీ సీ లింక్, ముంబయిపుణె ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మించే అవకాశం తనకు లభించిందన్నారు. అయితే అప్పట్లో సరైన సాంకేతికత అందుబాటులో లేకపోవడంతో కొన్ని ప్రాజెక్టులను చేపట్టలేకపోయామని తెలిపారు.

నగరంలో వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దశాబ్దాల క్రితం రూపొందించిన మౌలిక సదుపాయాలు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇదే తరహా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు పాత మౌలిక సదుపాయాలను ఆధునిక సాంకేతికతతో మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

**పాత ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయం**

ఫ్లైఓవర్ల నిర్మాణంలో సంప్రదాయ డిజైన్లపైనే ఆధారపడకుండా కొత్త సాంకేతికతను ఉపయోగించాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సూచించినట్లు గడ్కరీ తెలిపారు. పాత ఫ్లైఓవర్ల స్థానంలో అధునాతన నిర్మాణాలను తీసుకురావడం ద్వారా నగరాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చవచ్చన్నారు. పుణెలో ప్రతిపాదించిన రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టును కూడా గడ్కరీ ప్రస్తావించారు. ఒకే సెట్ పిల్లర్లపై అనేక స్థాయిల్లో ఫ్లైఓవర్లను నిర్మించేందుకు మలేషియా సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అదే నిర్మాణంపై మెట్రో కారిడార్‌ను కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

**భారత్ సామర్థ్యాలు.. అమెరికా వనరులు**

భారత్‌అమెరికా మధ్య సాంకేతిక సహకారం దేశం ఎదుర్కొంటున్న అనేక అభివృద్ధి సవాళ్లకు పరిష్కారం చూపగలదని గడ్కరీ అన్నారు. భారత్‌లో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలను అమెరికా వనరులు, నైపుణ్యంతో అనుసంధానిస్తే వివిధ రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు.



# కారు కొనుగోలు పేరుతో దోపిడీ

కీసర, సెప్టెంబర్ 13(ప్రజా క్షేత్రం):

కారు కొనుగోలు చేస్తామని నమ్మించి బాధితులను ఫార్మ్‌హౌస్‌కు రప్పించి పిస్టల్, కత్తితో బెదిరించి నగదు, ఐఫోన్, రెండు ఖరీదైన చేతి గడియారాలు, మెర్సిడెస్ బెంజ్ కారును అపహరించిన ఐదుగురు నిందితులను కీసర పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బోగారం క్రాస్‌రోడ్స్ వద్ద పట్టుకున్న నిందితుల నుంచి ఎయిర్ పిస్టల్, కత్తి, ఐఫోన్, టిస్సాట్, కాసియో వాచ్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీతో ఆగకుండా బాధితుడి వ్యక్తిగత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి రూ.1.50 లక్షలు డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



## ఆర్ కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బండమీది వెంకటేష్

**శంకర్ పల్లి సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ వర్గాల రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్. కృష్ణయ్యకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఆర్. కృష్ణయ్య సాగిస్తున్న సుదీర్ఘ పోరాటాన్ని బండమీది వెంకటేష్ కొనియాడారు. బీసీల హక్కుల సాధన కోసం ఆయన దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఉద్యమాలు వెనుకబడిన వర్గాల్లో చైతన్యాన్ని పెంపొందించాయని పేర్కొన్నారు. బీసీల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన పోషిస్తున్న పాత్ర కీలకమన్నారు. బీసీ సమాజం ఎదుర్కొంటున్న వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటం మరింత ఉధృతం కావాల్సిన అవసరం ఉందని వెంకటేష్ అన్నారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు, జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం, విద్యా-ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు దక్కే వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నవాపేట్ మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లింగం ముదిరాజ్, శంకర్‌పల్లి మండల బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చీర సాయి, నవాపేట్ మండల ఉపాధ్యక్షులు గొల్ల వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్యకు నాయకులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ బీసీ వర్గాల హక్కుల సాధన, సామాజిక సమానత్వం కోసం మరింత శక్తివంతంగా ఉద్యమించాలని ఆకాంక్షించారు.



## భక్తులకు వినాయక విగ్రహాల పంపిణీ

**కమలనగర్, సెప్టెంబర్ 13(ప్రజా క్షేత్రం):**
పీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కమలనగర్‌లోని ఆమె నివాసంలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు విగ్రహాలను అందజేశారు.
ఈ సందర్భంగా పావని మణిపాల్‌రెడ్డి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, నిమజ్జన సమయంలో పర్యావరణానికి హాని కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.
'మన పండుగ-మన బాధ్యత.. మన ప్రకృతి-మన భవిష్యత్తు' అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెంచాల సురేందర్‌రావు, కరిపే ప్రవీణ్ వంజరి, ప్రొద్దుటూరు గోవర్ధన్, మదన్‌మోహన్, చౌదరి, ఉమేష్, అరుణ్, ప్రకాష్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి.

- **ఎమ్మెల్యే రామారావు పటేల్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా-క్షేత్రం):**
భైంసా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంకోచం లేకుండా తక్షణమే అధికారికంగా నిర్వహించాలని ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామారావు పటేల్ గట్టిగా డిమాండ్ చేశారు. భైంసా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమగ్ర సమావేశంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాటి హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాట విశేషాలను, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఆయన సుదీర్ఘంగా ప్రస్తావించారు.

**పక్క రాష్ట్రాల తరహాలోనే ఇక్కడా జరగాలి**
నాటి నిజాం సంస్థానంలో భాగమైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోని జిల్లాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా విమోచన దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, అధికారికంగా నిర్వహిస్తున్నాయని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల్లో విమోచన దినోత్సవ వేడుకలకు అధికారిక హోదా కల్పించి, ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా జరుపుతుంటే, తెలంగాణలో మాత్రం ఆ ఊసే ఎత్తకపోవడం సరికాదన్నారు. మన ప్రాంతంలోనూ అదే రీతిలో విమోచన దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, ప్రభుత్వ అధికారిక ఆధ్వర్యంలోనే నిర్వహించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.

**త్యాగధనులకు నిజమైన నివాళి**
నాటి పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి కనీస ధర్మమని రామారావు పటేల్ పేర్కొన్నారు. రాబోయే తరాలకు మన విముక్తి పోరాట చరిత్రను, వీరుల గాథలను స్పష్టంగా అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇకనైనా కాలయాపన చేయకుండా విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి, అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# పులి వచ్చిందా..? తట్టేపల్లి అడవిలో కలకలం

- **పెద్ద శబ్దాలతో రైతుల్లో భయాందోళనలు**
- **శ్రీ అంబురామేశ్వర ఆలయ పరిసరాల్లో 'పులి' గుబులు**
- **ఆలయ పరిసరాలలో తట్టేపల్లి గ్రామస్తుల ఆరా**
- **అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న అనుమానాలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. అడవిలో ఆదివారం మధ్యాహ్నం పెద్ద శబ్దాలు వినిపించడంతో రైతులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే పులి సంచారం ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. తట్టేపల్లి పరివాహక ప్రాంతంలోని శ్రీ అంబరామేశ్వర స్వామి దేవాలయం పరిసరాల్లో కొంతకాలంగా వన్యప్రాణుల సంచారం ఉంటుందని చెబుతున్నారు. ఆదివారం జయరాం తండా (ఓ)కు చెందిన కొంతమంది రైతులు పశువులను మేత కోసం అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లిన సమయంలో మధ్యాహ్నం సుమారు ఒంటి గంట ప్రాంతంలో అడవిలో పెద్ద శబ్దాలు వినిపించినట్లు తెలిపారు.అనూహ్యంగా వినిపించిన శబ్దాలతో అప్రమత్తమైన రైతులు అక్కడ పులి లేదా ఇతర వన్యప్రాణి సంచరిస్తుందేమోనన్న అనుమానంతో వెనుదిరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు, పశువులను మేతకు తీసుకెళ్లేందుకు, ముఖ్యంగా ఒంటరిగా అటవీ ప్రాంతం వైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

**ఆలయ పరిసరాల్లో తట్టేపల్లి గ్రామస్తుల ఆరా**
అడవిలో పెద్ద శబ్దాలు వినిపించాయన్న సమాచారం తెలియడంతో తట్టేపల్లి గ్రామస్తులు శ్రీ అంబురామేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ఆరా తీశారు. ఆలయం చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో ఏవైనా వన్యప్రాణుల ఆనవాళ్లు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించారు.అయితే పులి సంచరించినట్లు నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని స్థానికులు పేర్కొన్నారు.అనూహ్యంగా వినిపించిన శబ్దాలతో అప్రమత్తమైన రైతులు అక్కడ పులి లేదా ఇతర వన్యప్రాణి సంచరిస్తుందేమోనన్న అనుమానంతో వెనుదిరిగినట్లు తెలిపారు.

**అధికారుల పరిశీలనకు డిమాండ్**
అడవిలో వినిపించిన శబ్దాల వెనుక కారణం ఏమిటన్నది స్పష్టంగా తెలియకపోవడంతో అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.అవసరమైతే అటవీ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసి వన్యప్రాణుల సంచారంపై పరిశీలన చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పులి సంచారం నిజమేనా? లేక ఇతర వన్యప్రాణుల కారణంగానే శబ్దాలు వినిపించాయా? అనే విషయంపై అటవీశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.అప్పటివరకు రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు





## గణపతి మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి.

- **శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలి.**
- **ఎస్సై శ్రీనివాస్ యాదవ్.**

**కోటగిరి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ సూచించారు. పోతంగల్ మండల కేంద్రంలో గణేష్ మండపాల నిర్వాహకులతో, ముస్లిం మత పెద్దలతో గణేష్ ఉత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...గణపతి మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు పూర్తిగా అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గణపతి మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని, గొడవలు, వివాదాలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా గణపతి విగ్రహాల ఊరేగింపు రోజున విద్యుత్ స్తంభాలు, వైర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విగ్రహం విద్యుత్ వైర్లకు తగలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన చోట విద్యుత్ వైర్లను మార్చుకునేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గణపతి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతి భద్రతల విషయంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, ఉపసర్పంచ్ నబి, మాజీ సర్పంచ్ వహీద్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జుమ్మా ఖాన్, కాంగ్రెస్ యూత్ నాయకుడు బజరంగ్ దత్తు, గ్రామ పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## నిబద్ధత గల అధికారిణిపై నిందలా?

- **ఎస్పీ డా. జానకి షర్మిలకు పోలీస్ అసోసియేషన్ బాసట.**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా-క్షేత్రం):**
నిర్మల్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్పీ డా. జానకి షర్మిలపై కొందరు స్వార్థపూరిత శక్తులు చేస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం (పోలీస్ అసోసియేషన్) తీవ్రంగా ఖండించింది. వాస్తవాలకు విరుద్ధంగా, ఉద్దేశపూర్వకంగానే ఆమెపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.




**శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం**
జిల్లాలో నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల రక్షణ కోసం ఎస్పీ జానకి షర్మిల అహర్నిశలూ శ్రమిస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు సిబ్బంది సంక్షేమం కోసమూ ఆమె ఎంతో పాటుపడుతున్నారని కొనియాడారు. విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తున్న అధికారిణిపై ఇటువంటి నిందలు వేయడం సరికాదన్నారు.

**దుష్ప్రచారాలను నమ్మవద్దు**
వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరిస్తూ, ఆమె ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం మరియు దుష్ప్రచారం చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సంక్షేమ సంఘం అభిప్రాయపడింది. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలను జిల్లా ప్రజలు గానీ పోలీస్ సిబ్బంది గానీ నమ్మవద్దని కోరింది. నిబద్ధత గల అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు హెచ్చరించారు.

## భారతీయ జనతా పార్టీ లో భారీ చేరికలు

**నవాబుపేట్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వం మెచ్చి బీజేపీ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సిద్ధాంతం నచ్చి బీజేపీ పార్టీకి ఆకర్షితులై నవాబ్ పేట్ మండలం ముభారక్ పూర్ గ్రామానికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే రత్నం చేతులమీదుగా పార్టీ కండువా కప్పు కొన్నారు. మండల అధ్యక్షులు చంద్రకాంత్ అధ్యక్షతన, ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి, గ్రామ బూత్ అధ్యక్షులు కిరణ్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారు జాకా ప్రకాష్ వార్డు మెంబర్, సంతోష్, శంకర్ దశరథ్, రాములు, ప్రకాష్ పవన్ వెంకటపతి సంజీవరెడ్డి, డాకయ్య, చంద్రయ్య, బుచ్చయ్య, అనంతయ్య, శ్రీపతి వెంకట్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, పర్మా రెడ్డి, వంశి రెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింలు, సుశాంత్ రెడ్డి, బిక్షపతి, మల్లారెడ్డి, పరమేష్, విట్టల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి చే చంద్రయ్య, వై వెంకట్ రెడ్డి, ఎస్ వెంకట్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్, శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ సీనియర్ నాయకులు కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



## మాదిగ జాతిని ఐక్యమత్యం చేయడమే మా లక్ష్యం

- **నవాబుపేట్ ఎమ్మార్పియస్ మండల అధ్యక్షుడు నల్లోళ్ల శేఖర్ మాదిగ**

**నవాబుపేట్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎక్ మామిడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా జి. రాజేందర్ మాదిగ, అధికార ప్రతినిధిగా నరసింహులు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఎం. ప్రసాద్ మాదిగ ఉపాధ్యక్షులుగా అరుణ్ కుమార్ మాదిగ కోశాధికారులుగా భీమాణిక్యం మాదిగ కార్యదర్శులుగా ఏం రవికుమార్ మాదిగ సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్ మాదిగ, కృష్ణ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, ఈశ్వర్ మాదిగ ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.



## అక్రమ ఇసుక వాహనం పట్టివేత

**కోటగిరి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**
పోతంగల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని కోటగిరి పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పోతంగల్ గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎదురుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండటంతో తరలింపునకు సంబంధించిన ప్రభుత్వ అనుమతి పత్రాలను పోలీసులు అడిగారు. తన వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్ చెప్పడంతో వాహనాన్ని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



# సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- **పాలమాకుల సర్పంచ్ కటుకురి కోటేశ్వర్ గౌడ్.**

**శంషాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలోని గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు పోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోనే సాధ్యమవుతుందని శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, పాలమాకుల సర్పంచ్ కటుకురి కోటేశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించ డానికి అసెంబ్లీలో తీర్మాణం పెట్టి ఆమోదం పొందిన దాన్ని పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్కా, పంచాయతీ రాజ్ మంత్రివర్యులు సీతక్క, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. అనంతరం కోటేశ్వర్ గౌడ్, మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ..ఇది గ్రామపంచాయతీ లకు ఎంతగానో ఉపయోగ పడుతుందని బిఆర్ఎస్ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ చట్ట సవరణ తరువాత గ్రామ పంచాయతీలకు మహర్దశా వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ఫోరమ్ అధ్యక్షులు కోటేశ్వర్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజు ముదిరాజ్, సర్పంచులు రవినాయక్, ప్రభాకర్ గౌడ్, బుజ్జి గోపాల్, మౌనిక అంజనేయులు, సత్యనారాయణ గౌడ్, మల్చలంలింగం, దవేందర్, ఇందిరమ్మ, ఊసర్పంచులు కుమార్, శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# సకల గణాలకు అధిపతి గణపతి... బండి రమేష్

**హైదరాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

వినాయక చవితిని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బాల్నగర్ డివిజన్ రాజు కాలనీ గాంధీ విగ్రహం దగ్గర పర్యావరణ హితమైనటువంటి మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం టిపిసిసి ఉపాధ్యక్షులు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ చేతుల మీదగా స్థానికులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పర్యావరణం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత పై ప్రజలకు అవగాహన పెరిగిందని, ప్రభుత్వం కూడా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ పండుగలు పర్యావరణ హితంగా జరుపుకునేటట్లు ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి డైరెక్టర్ పుష్ప రెడ్డి, జిహెచ్ఎంసి ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బాలనగర్ డివిజన్ అధ్యక్షులు శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, డిసిసి స్పోక్స్ పర్సన్ మధుమోహన్, భరత్, జల్లి శివ, పద్మావతి, ఊర్మిళా, సాయి భారతి ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.




# తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరులకు ఘన నివాళి

- **ఆపరేషన్ పోలో డే సందర్భంగా బీజేపీ నేతల నివాళులు**

**వనపర్తి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

ఆపరేషన్ పోలో డే సందర్భంగా తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, హోం మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ పెద్దిరాజు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1948 సెప్టెంబరు 13న సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో ప్రారంభమైన ఆపరేషన్ పోలో తెలంగాణ విమోచన చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. నిరంకుశ నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించడంతోపాటు హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో సంపూర్ణ విలీనానికి ఈ చర్య మార్గం సుగమం చేసిందన్నారు. 1947 ఆగస్టు 15న యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నప్పటికీ.. తెలంగాణ ప్రజలు మాత్రం నిజాం, రజాకార్ల అణచివేత, హింస, దౌర్జన్యాలను మరో 13 నెలలపాటు భరించాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ విమోచనం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీర సైనికుల సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి నాటి హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాయని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా విమోచన దినోత్సవానికి తగిన గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. ఎంఐఎం పార్టీ మెప్పు కోసం మైనార్టీ ఓట్ల రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, వారణాసి కల్పన, ఉపాధ్యక్షుడు గౌర్ల బాబురావు, జిల్లా కార్యదర్శి సరోజ, సీనియర్ నాయకులు సుమిత్రమ్మ, బాశెట్టి శ్రీనివాసులు, కొమ్ము సామేలు, బచ్చు రాము, గుంటి శివ, ఆగపోగు కుమార్, దాసరాజు ప్రవీణ్, ఎద్దుల దేవేందర్, యువమోర్చా అధ్యక్షుడు అరవింద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కవిత, మైనార్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, పట్టణ కార్యదర్శి చినరాయుడు, కౌన్సిలర్లు గంధం బాల, ఉండెకోటి వెంకటేష్, తిరుపతయ్య యాదవ్, కొండోజు గోపీనాథ్, వసిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి నేస్తం విశ్వనాధ్‌కు గౌరవ డాక్టరేట్

- **- మూడున్నర దశాబ్దాల విద్యా సేవలకు అరుదైన గౌరవం**
- **యువతకు మార్గదర్శకత్వం.. సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక డాక్టరేట్**

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

మూడున్నర దశాబ్దాలుగా విద్య, యువత, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ విద్యావేత్త "విద్యార్థి నేస్తం" విశ్వనాధ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. గాంధేయ తత్వం, శాంతి, మానవతా విలువల విభాగంలో అందించే గౌరవ డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. భువనేశ్వర్‌లో మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా విశ్వనాధ్ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. విద్యార్థులకు కెరీర్ అవగాహన, మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక చైతన్యం కల్పించే కార్యక్రమాలను విశ్వనాధ్ నిరంతరం కొనసాగిస్తున్నారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న సేవలకు ఈ గౌరవం గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ విశ్వనాధ్‌ను అభినందిస్తూ విద్యార్థులు, యువత కోసం ఆయన అందిస్తున్న సేవలను ప్రశంసించారు. పలువురు విద్యావేత్తలు, విద్యారంగ ప్రముఖులు, సామాజికవేత్తలు, అభిమానులు విశ్వనాధ్‌కు అభినందనలు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని విశ్వనాధ్ తెలిపారు. యువతకు మరింత మెరుగైన మార్గదర్శకత్వం అందిస్తూ, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచే దిశగా తన సేవలను మరింత విస్తృతం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా గణేష్, డాక్టర్ పి. మురళీ మనోహర్, సమీక్షా ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ నటరాజ్, ప్రముఖ సామాజికవేత్త బాల్డా అశోక్, విద్యావేత్త గోవర్ధన్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు వాడవాడలా కొలువుదీరనున్న గణనాథుడు

- **- వినాయక చవితికి ముస్తాబైన మండపాలు**
- **- రంగురంగుల విద్యుత్ దీపాలు.. ఆకట్టుకునే అలంకరణలు**
- **ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు**
- **యువతలో ఉరకలేస్తున్న ఉత్సాహం**

**పెద్దేముల్, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**



విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆరాధనకు పెద్దేముల్ మండలం ముస్తాబైంది. వినాయక చవితి సందర్భంగా పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నేడు(సోమవారం) వాడవాడలా గణనాథుడు కొలువుదీరనున్నాడు. గణేష్ ఉత్సవాల కోసం ఇప్పటికే వినాయక ఉత్సవ కమిటీల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, ఆకట్టుకునే డెకరేషన్లు, వివిధ రకాల థీమ్‌లతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. భక్తులను ఆకట్టుకునేలా మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. గణేష్ విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

**గణేష్ ఉత్సవాలకు సిద్ధమైన యువత**

వినాయక ఉత్సవాల నిర్వహణలో యువత ఉత్సాహంగా పాల్గొంటోంది. మండపాల ఏర్పాటు, అలంకరణలు, విద్యుత్ దీపాల అమరిక, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర ఏర్పాట్లలో యువకులు నిమగ్నమయ్యారు. తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు,భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

**గణేష్ ఉత్సవాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం**

వినాయక చవితి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠకు ముందు నుంచే భక్తులు, యువతలో సందడి కనిపిస్తోంది. గణనాథుడి నామస్మరణతో పల్లెలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. భక్తిశ్రద్ధలతో వినాయకుడిని కొలిచి, తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**భక్తిశ్రద్ధలతో గణనాథుడి సేవలో**

వినాయక చవితి నుంచి నవరాత్రుల వరకు గణనాథుడికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొనేలా కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దీంతో పెద్దేముల్ మండలంలో వినాయక చవితి వేడుకలు భక్తి, ఉత్సాహం, ఆనందాల సమ్మేళనంగా సాగనున్నాయి.



# దౌలాపూర్, చెన్నారం, రైతుల జీవనాధారమైన పట్టా భూములు తీసుకున్నారు

- **ఉపాధి, ఆర్థిక ఇబ్బందుల్లో రైతు కుటుంబాలు.**
- **ఇంటిగ్రేటెడ్ పేరుతో రైతులు దగా.**
- **ఎకరాకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి రైతుల డిమాండ్.**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కీ రైతులు వినతి పత్రం సమర్పణ**

**యాలాల సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని దౌలాపూర్, చెన్నారం, రెవెన్యూ గ్రామాల రైతులు తమ జీవనాధారమైన పట్టా భూములు దళిత, పేదలు ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో నష్టపోయామంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కి ఆదివారం భూములు నష్టపోయిన రైతులు రైతు కుటుంబాలు, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు యు. బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దప్పు మహేందర్, కలిసి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దప్పు, మహేందర్ మాట్లాడుతూ..యాలాల మండలం దౌలాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలో ని సర్వేనెంబర్ 73 లో చెన్నారం, దౌలాపూర్ రెవెన్యూ గ్రామాల దళిత, వడ్డె కులస్తుల పేద రైతులకు 25 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం 1980 ఏడాదిలో సాగు చేసుకోవడానికి 11మంది కుటుంబాలకు 2 ఎకరాల చొప్పున 25 ఎకరాలు భూపంపిణి చేయడం జరిగింది. ఇంటిగ్రేటెడ్ పేరుతో ప్రభుత్వం దగా చేసిందని పేర్కొన్నారు. ఇట్టి భూమిలో గతం నుండి ఇప్పటి వరకు కబ్జా లో ఉండి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి జిల్లాలో అభివృద్ధిపైతో పేద, దళిత రైతుల భూములను తీసుకొని రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో రైతుల పొలాల నుండి పూర్తిగా ఎర్రమట్టిని తరలించి,దళిత పేదల భూమిని సాగు చేసుకోవడానికి వీలు లేకుండా చేసి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పనులు చేస్తున్నారు. ఈ యొక్క భూమికి ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా పేద ప్రజల్ని మోసం చేస్తున్నారు. పాలకుల సహకారంతో రెవెన్యూ అధికారులు దౌర్జన్యం చేస్తూ కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారంగా పేదల భూములు తీసుకున్నప్పుడు ప్రస్తుతం ధరలు అనుగుణంగా మూడింతాలు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. ఉపాధి, ఆర్థిక ఇబ్బందుల్లో రోడ్డు పాలయ్యారు. భూసేకరణ చట్టానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వాన్ని ఒప్పించి దళిత, పేదల భూములకు నష్ట పరిహారం, భూమి భూమి ఇప్పించే విధంగా చూడాలని, రైతులు మరియు ప్రజా సంఘాల నాయకులు కోరడమైనది. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, బాలరాజ్, పెద్ద వెంకటయ్య, చంద్రమ్మ, శ్రీనివాస్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం మహిళల కొట్లాట.. వైరల్ అయిన వీడియో

- **పరిగి-హైదరాబాద్ బస్సులో సీట్ల కోసం మహిళల తీవ్ర ఘర్షణ**
- **సోషల్ మీడియాలో వైరల్ అయిన కొట్లాట వీడియో**
- **ఈ ఘటనపై ఇంకా స్పందించని టీజీఎస్ఆర్టీసీ, పోలీసులు**



**పరిగి సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరిగి నుంచి హైదరాబాద్ వెళుతున్న టీజీఎస్ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొందరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సుల్లో పెరిగిన రద్దీ, తలెత్తుతున్న వివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది. వివరాల్లోకి వెళితే, వికారాబాద్ జిల్లా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో ఈ గొడవ జరిగింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో సీటు విషయంలో నలుగురు మహిళల మధ్య వాగ్వాదం మొదలై, అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారిని విడదీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గొడవతో ఇబ్బందిపడిన కొందరు ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయినట్లు సమాచారం. తెలంగాణలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తరచూ ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. ఒక మంచి పథకాన్ని ఇలాంటి ఘటనలతో అపహాస్యం చేస్తున్నారని సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**వలిగొండ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కారుల స్టేట్ కమిటీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా నిరుద్యోగ ఉద్యమ కళాకారులు జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా ఇంచార్జీ వేముల హరిక్రిష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కాలికి గజ్జ కట్టి భుజాన గొంగడి రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన కళాకారులను గత ప్రభుత్వ విస్మరించింది అదేవిధంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో కాలయాపన చేస్తూ కళాకారుల బతుకులలో మట్టి కొడుతున్న సందర్భంలో నిన్న శాసనమండలిలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడినటువంటి మాటలను బట్టి ఇక కళాకారులను ఆదుకొని వారికి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని అర్థమవుతుంది కాబట్టీ ఇక నైనా ప్రభుత్వం స్పందించకపోతే ఈ కాంగ్రేస్ ప్రభుత్వానికీ గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుంది అని హెచ్చరిస్తూ... త్వరలో రవింద్రాభారతి ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గంధమల్ల శివశంకర్ అధ్యక్షులు కోట భిక్షపతి, కళాకారులు గణేష్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.





# ఏమి కొనేటట్టు లేదు ఏమి తినేటట్టు లేదు.

- **ఆకాశాన్ని అంటిన నిత్యవసర సరుకులు ధరలు.**
- **పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం.**

**నంద్యాల సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**



తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు మరింత భారంగా మారాయి. రోజురోజుకూ ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు కొనలేక.. తినలేక అవస్థలు పడుతున్నాయి. కుటుంబ అవసరాలకు సరుకులు కొనుగోలు చేయాలంటే చేతిలో ఉన్న డబ్బులు కరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకుల ధరలు భగభగమంటుండటంతో గతంలో మాదిరిగా అన్ని సరుకులు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. అవసరమైన వాటిలోనూ సగం సరుకులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఒకప్పుడు సంచుల్లో సరుకులు తీసుకెళ్లిన ప్రజలు.. ప్రస్తుతం సంచుల్లో డబ్బులు తీసుకెళ్లి కవర్లలో సరుకులు తెచ్చుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల భారంతో కుటుంబ బడ్జెట్ తలకిందులు కూరగాయలు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో నెలవారీ కుటుంబ బడ్జెట్ తారుమారవుతోందని ప్రజలు చెబుతున్నారు. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయని అంటున్నారు. వర్షాభావంతో ఉపాధి అవకాశాలు తగ్గిన సమయంలో ధరల పెరుగుదల మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొంటున్నారు.

ధరల పెరుగుదలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించడంలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ ఎన్ ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శిగా గుర్రంపల్లి జగదీష్ యాదవ్,

- **ఎన్ ఎస్ యుఐ బలోపేతానికి కృషి చేస్తా.**

**శంషాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం)**



తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యుఐ నూతన రాష్ట్ర జిల్లా కమిటీలను సెప్టెంబర్ 9న ప్రకటించారు. ఈ నూతన కమిటీలో శంషాబాద్ మండలం నర్ఖూడ గ్రామానికి చెందిన యువ నాయకుడు గుర్రంపల్లి జగదీష్ ను తెలంగాణ ఎన్ ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ఎన్ ఎస్ యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని జగదీష్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, విద్యారంగ సమస్యలు, ఫీజు రీయింబర్స్మెంట్ నిరుద్యోగం, తదితర అంశాలపై విద్యార్థుల తరపున నిరంతరం పోరాడతానని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఎన్ఎస్ యూఐ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# ప్రతిభకు పురస్కారం..

- **ఆధ్యాత్మికతకు ప్రోత్సాహం.**
- **పురాతన వైభవాన్ని వెలుగులోకి తేవాలి.**
- **పలుస శంకర్ గౌడ్.**

**వనపర్తి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతలను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు ప్రతిభావంతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.

ఆదివారం వనపర్తిలో నిర్వహించిన రెండు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బొమ్మల పల్లకి వీడియోగ్రఫీ పోటీల్లో ద్వితీయ బహుమతితో 'ప్రతిభా పురస్కారం' పొందిన నక్క విష్ణును స్థానిక రేడియంట్ హైస్కూల్ ప్రాంగణంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ శ్రీరంగాపురం పుణ్యక్షేత్రంపై నక్క విష్ణు రూపొందించిన లఘు డాక్యుమెంటరీ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, శాలువ, రూ.6 వేల నగదు అందించినట్లు తెలిపారు. జిల్లాలో అనేక ప్రాచీన కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని, వాటి విశిష్టతను వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతిభను గుర్తించి అందించే అవార్డులు మరింతగా రాణించేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.

**యాగాలతో విశ్వశాంతి..**

**ఆధ్యాత్మిక చైతన్యం**

వనపర్తి పట్టణంలో గత రెండు వారాలుగా కొనసాగుతున్న అతిరుద్ర, అయిత చండీయాగ కార్యక్రమాలను కూడా శంకర్ గౌడ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాగాలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వ్యక్తిలోని చెడు ఆలోచనలను తొలగించి సర్వ మానవ హితం, క్రమశిక్షణ వైపు నడిపిస్తాయని అన్నారు. ప్రజలు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో జీవించాలనే సంకల్పంతో కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ జిల్లా కేంద్రంలో ఈ క్రతువును నిర్వహించడం ఆనందదాయకమన్నారు.

అనంతరం కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ శంకర్ గౌడ్‌ను కండువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం జిల్లా కన్వీనర్ డా. బైరోజు శ్యాంసుందర్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, డా. కంటే నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, డా. తూర్పింటి నరేశ్ కుమార్, పెరుమాళ్ల శ్రీనివాస్, దేశి రాములు, యాదవ్ దినేశ్, వ్యాపారవేత్తలు



# విశ్వశాంతి మహాయాగంతో ఆధ్యాత్మిక వైభవం

- **వేదఘోషల మధ్య పూర్ణాహుతి.**
- **లోకకల్యాణాన్ని ఆకాంక్షించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి.**

**వనపర్తి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

విశ్వశాంతి మహాయాగంతో వనపర్తి పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వేదమంత్రాల ఘోష, హోమగుండాల నుంచి వెలువడిన పవిత్ర ధూపధూమాలు, భక్తిశ్రద్ధలతో యాగశాల దివ్య వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ సంకల్పంతో పక్షం రోజులుగా జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో కొనసాగిన విశ్వశాంతి మహాయాగం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది.

**కుటుంబ సమేతంగా పూర్ణాహుతి**

మహాయాగం ముగింపు కార్యక్రమంలో వనపర్తి డీసీసీ చీఫ్ శివసేనారెడ్డి, హర్షశ్రీ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. విశ్వశాంతి మహాయాగంతో వనపర్తి ఆధ్యాత్మిక వైభవానికి వేదికగా నిలిచిందన్నారు. యాగశాలలో ప్రతిధ్వనించిన వేదఘోషలు, నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో దైవభక్తిని పెంపొందించాయని పేర్కొన్నారు. ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

లోకకల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ పక్షం రోజుల పాటు మహాయాగాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల సుభిక్షం, సౌభాగ్యం, ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ ఇంతటి బృహత్తర యాగాన్ని నిర్వహించడం విశిష్టమైన ఆధ్యాత్మిక సంకల్పానికి నిదర్శనమని కొనియాడారు.

శివసేనారెడ్డికి స్వామీజీ ఆశీస్సులు మహాయాగం అనంతరం శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ శివసేనారెడ్డి, హర్షశ్రీ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం శివసేనారెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశీస్సులు అందించారు. భవిష్యత్తులో ప్రజాసేవలో కొనసాగుతూ ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. మహాయాగం ముగింపు సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు యాగశాలకు తరలివచ్చారు. స్వామీజీ ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురి హాజరు



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ఓబీసీ నాయకుడు నందిమల్ల చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్, కౌన్సిలర్లు ధనలక్ష్మి, విభూది మహేశ్వరి, విజయలక్ష్మి, మండలాధ్యక్షుడు నక్క రవికిరణ్, మైనార్టీ నాయకుడు ఎండీ బాబా, యువజన కాంగ్రెస్ నాయకులు శివకుమార్ నాయుడు, అరవింద్ నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మహాయాగం నుంచి పరామర్శ వరకు.. ఎమ్మెల్యే మేఘారెడ్డి బిజీబిజీ

**వనపర్తి, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

గత వారం రోజులుగా అసెంబ్లీ సమావేశాలలో పాల్గొని ఆదివారం వనపర్తి చేరుకున్న శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. 13 రోజులుగా వనపర్తి జిల్లా కేంద్రంలో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగం లో చివరి రోజు పాల్గొనడంతోపాటు పలు శుభకార్యాలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. అనంతరం నూతన ఎలక్ట్రికల్ స్కూటర్ షోరూమ్‌ను సందర్శించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం అందుకున్న ఆయన.. వ్యక్తిగత భద్రతా అధికారి జగదీశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**మహాయాగంలో ప్రత్యేక పూజలు**

శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ సంకల్పంతో వనపర్తిలో 13 రోజులుగా నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొన్నారు. యాగశాలలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ ఆశీస్సులు పొందారు. ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం, ఆయురారోగ్యాల కోసం నిర్వహిస్తున్న మహాయాగం ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆధునిక జీవన విధానంలో కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. యాగం విజయవంతంగా కొనసాగాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

**పలు శుభకార్యాలకు హాజరు**

అనంతరం వనపర్తి ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో పట్టణానికి చెందిన బెస్త నర్సింహులు, సునీతల మనుమడు అగస్త్యరామ పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. తర్వాత కొత్తకోట రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన ఎలక్ట్రికల్ స్కూటర్ షోరూమ్‌ను సందర్శించారు. షోరూమ్ నిర్వాహకులు ఇంతియాజ్, మేనేజర్ భాస్కరాచారిని అభినందించారు. కొత్తకోటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చాపల సత్యరెడ్డి మనవడి తొట్లే కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, కీర్తిరెడ్డిల కుమార్తె తొలి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

**గణేష్ ఉత్సవాలకు ఆహ్వానం**

వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆదివారం నంది హిల్స్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మేఘారెడ్డిని కలిశారు. వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి పూజా కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

**జగదీశ్వర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ**

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తన వ్యక్తిగత భద్రతా అధికారి జగదీశ్వర్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో





ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆయన నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరే రాములు, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, కౌన్సిలర్ విభూది మహేశ్వరి, విజయలక్ష్మి, పరుశురాం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, రవి యాదవ్, కృష్ణబాబు, ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు రమేష్‌చంద్ర, బి. కృష్ణ, పాల రవి, గొల్లరవి, విభూతి నారాయణ, పెబ్బేరు మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గొల్ల వెంకటయ్య, రమేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా రైస్‌మిల్ నిర్మాణం?

- **మస్తిపూర్ క్రాస్‌రోడ్డులో ప్రభుత్వ అనుమతులపై ఆరోపణలు**

**అమరచిత సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

అమరచింత వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తిపూర్ క్రాస్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న రైస్‌మిల్‌పై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణంలో నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ లేకుండా పనులు చేపడుతున్నారని, భారీగా మట్టిని తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన వేల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు, రుసుముల విషయంలోనూ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే కాలువను రహదారిగా మార్చి నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రైస్‌మిల్ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, అనుమతుల వివరాలను చూపించాలని కోరితే స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తనకు స్థానిక అధికార పార్టీ నేతతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మంత్రి కూడా తమ బంధువేనంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు యజమానిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను సంబంధిత యాజమాన్యం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా రైస్‌మిల్ నిర్మాణంతో పాటు యాజమాన్యం వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు ప్రస్తుతం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మట్టి తరలింపు, కాలువ మార్పు తదితర అంశాలపై వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.



# నిర్మల్ జిల్లా ప్రజలకు డా. ఎస్పీ జానకి షర్మిల.. వినాయక చవితి శుభాకాంక్షలు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా-క్షేత్రం):**



నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో అత్యంత శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల. పిలుపునిచ్చారు పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ ఆమె హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరస్పర సోదరభావంతో పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసే గణేష్‌మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు భక్తులు పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. వినాయక విగ్రహాల ప్రతిష్టాపన జరిగిన నాటి నుంచి, నవరాత్రుల పూజలు పూర్తి చేసుకుని నిమజ్జనం చేసే ప్రక్రియ ముగిసే వరకు ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని భక్తులకు, కమిటీ సభ్యులకు ఎస్పీ డా. జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు.

# ఎస్పీ ఆదేశాల మేరకు గణేష్ డిజేలు వాడితే జైలుకే..

**ఆత్మకూరు ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**



గణేష్ ఉత్సవాలలో నిర్వాహకులకు డీజే వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని సబ్ ఇన్స్పెక్టర్ వి. జయన్న హెచ్చరించారు. గణేష్ నవరాత్రులలో ప్రశాంతంగా పూజలు భక్తి పాటలతో భజనలతో ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై జయన్న తెలిపారు. ఎస్పీ సునీత రెడ్డి ఆదేశాల మేరకు ఈసారి నిబంధనలు పాటించాలని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు మండపాల దగ్గర ఎలాంటి లొల్లి లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు అదేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై జయన్న తెలిపారు.



## మహిళల నాయకత్వాన్ని బలపరచండి

**నంద్యాల సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్ర):**

మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు మండలాల పర్యటనలో భాగంగా శనివారం రోజున మండల కేంద్రమైన పాములపాడులోని, ఎస్సీ కాలనీ చర్చి దగ్గర మండల అధ్యక్షుడు రాంప్రసాద్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షుడు బుల్లెద్దుల మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మాదిగ మహిళా సమైక్య అధ్యక్షురాలు నందిని మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ప్రేమ రాజు మాదిగ, తదితరులు హాజరు కావడం జరిగింది. అనంతరం మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నందిని మాట్లాడుతూ మహిళల నాయకత్వం పెంపొందించే విధంగా ఉద్యమ కార్యచరణ ఉంటుంది కాబట్టి మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం మరియు చట్టాలపై అవగాహన అవసరం అని అందుకే మహిళలు కూడా సమాజంలో జరుగుతున్న అసమానతలను గుర్తించి మహిళల హక్కుల కోసం, పోరాటాల వైపు కొనసాగాలని, ఉద్యమాలలో పాలుపంచుకొని నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, మందకృష్ణ మాదిగ ఆశయమైనటువంటి బడుగుల రాజ్యాధికారంకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా పాములపాడు మండల నూతన మహిళా కమిటీని ప్రకటించడం జరిగిందనీ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ప్రేమ రాజు తెలిపారు. మండల కన్వీనర్ గా నులక భారతి మాదిగ కో కన్వీనర్ గా కర్నాటి ప్రియాంక మాదిగ, లావణ్య, దుర్గమ్మ, లక్ష్మీదేవి లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏమేలమ్మ. చౌడమ్మ, సుమిత్ర, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, అనంతమ్మ, మరియమ్మ, నాగరత్నమ్మ, బాలేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను ప్రారంభించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

**నిజామాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా చందూరు మండల కేంద్రంలోని చందూర్ మండలం ఆయకట్టు పొలాలకు సాగునీటి విడుదల చేసిన బాన్సువాడ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చందూర్ మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మొదటగా చందూర్ బస్టాండు వద్ద బాన్సువాడ నిజామాబాద్ రహదారిపైమ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



## శంషాబాద్ పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు.

- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్,**

**శంషాబాద్ సెప్టెంబర్ 13(ప్రజా-క్షేత్రం)**



దేశ ప్రజల సామాజిక జీవన విధానంలో గణపతి నవరాత్రుల వేడుకలు పల్లె నుండి పట్టణం వరకు సాంస్కృతిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని శంషాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిల్కమర్రి మహేందర్ అన్నారు. వినాయక చవితి పర్వదినం నుండి ప్రారంభం అయ్యే గణేష్ నవరాత్రులు ఉత్సవాల సందర్భంగా.. ప్రజల్లో మత సమరస్యం, దైవభక్తి, సమిష్టి తత్వం బలపడాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా శంషాబాద్ పట్టణ ప్రజలకు మహేందర్ ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని విఘ్నాలను తొలగించి ప్రజలకు శుభాలను చేకూర్చి ఆదిదేవునిగా విగ్నేశ్వరుడు హిందూమత సాంప్రదాయంలో ప్రత్యేక పూజలు అందుకుంటారని అన్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెలివేరిసేలా దీవించాలని గణనాధుని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

## విద్యుత్ శాఖ జేఈ అదృశ్యం

**నంద్యాల సెప్టెంబరు 13(ప్రజాక్షేత్రం):**

కొలిమిగుండ్ల మండల కేంద్రంలో విద్యుత్ జేఈ చింతా లక్ష్మణస్వామి అదృశ్యం గత నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన జేఈ లక్ష్మణస్వామి ఆందోళనలో కుటుంబీకులు నాలుగు రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్.. ఎక్కడా లభించని ఆచూకీ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కొలిమిగుండ్ల పోలీసులు కుటుంబ కలహాలా? విధి నిర్వహణలో ఒత్తిడా? అనే కోణాల్లో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



# డప్పులతో కదంతొక్కిన ఉండ్యాల కాంగ్రెస్ దళిత సోదరులు

**చిన్నచింతకుంట సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం)**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ చిన్నచింతకుంట మండలం ఉండ్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ దళిత సోదరులు డప్పుల మోతతో కదంతొక్కారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఆయన తల్లిని అవమానించేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఉండ్యాలలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ తీరును తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. మండల నాయకులు వెంకటేష్ నాగరాజు మాట్లాడుతూ... దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఇకపై సహించేది లేదని కాంగ్రెస్ దళిత నాయకులు హెచ్చరించారు. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

**"పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. మలిన రాజకీయాలను"**

ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్ సమీపంలో దళితులు డప్పుల మోతతో కేసీఆర్ ఫార్మ్‌హౌస్‌ను చుట్టుముట్టేందుకు వెళ్తున్న సమయంలో దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఘటన దళితుల పట్ల బీఆర్ఎస్ నాయకుల వివక్షకు నిదర్శనమని కాంగ్రెస్ దళిత నాయకులు ఆరోపించారు.

దళితులు నడిచిన నేలను శుద్ధి చేయాల్సిన అవసరం లేదు. పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. దళితులను అవమానించే మలినమైన రాజకీయ మనస్తత్వాలను" అని వారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. దళితులను అవమానించే, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచే విధానాలను తెలంగాణ సమాజం అంగీకరించదని అన్నారు.

**దళితులను ఓటు బ్యాంకుగా చూశారని విమర్శ**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో దళితులకు రాజకీయంగా సముచిత స్థానం, గౌరవం కల్పించలేదని కాంగ్రెస్ దళిత నాయకులు విమర్శించారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు బీఆర్ఎస్ తెరతీసిందని ఆరోపించారు.

మంత్రివర్గంలో దళితులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, దళిత ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తాటికొండ రాజయ్యను పదవి నుంచి తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. దళితుల పట్ల బీఆర్ఎస్ వైఖరి ఎలా ఉందో గత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

**దళితులకు గౌరవం ఇచ్చింది కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దళితులు, అణగారిన వర్గాల సామాజిక, రాజకీయ హక్కుల కోసం నిలబడిన పార్టీ అని కాంగ్రెస్ దళిత నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దళిత నాయకుడు దామోదరం సంజీవయ్యకు అవకాశం కల్పించడంతో పాటు, అనంతరం ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

ప్రస్తుతం కూడా దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గేను అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూ కాంగ్రెస్ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని తెలిపారు. రాజకీయంగా అత్యున్నత పదవుల్లో దళితులకు అవకాశాలు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో దళితులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు పార్టీ పదవులు, వివిధ కార్పొరేషన్ పదవుల్లోనూ అవకాశాలు కల్పిస్తున్నారని గుర్తుచేశారు.











**"వివక్షకు గురికావడం ఎందుకు?.. గౌరవం ఇచ్చే కాంగ్రెస్‌లోకి రండి"**

బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ అవమానాలు, వివక్షకు గురికావడం కంటే దళితులకు మొదటి నుంచి సముచిత స్థానం, గౌరవం కల్పిస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఉండ్యాల కాంగ్రెస్ దళిత నాయకులు పిలుపునిచ్చారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. దళితుల పట్ల వివక్షను ప్రదర్శించే ఏ రాజకీయ శక్తినైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో చిన్నచింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# భైంసా మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ల రిలే దీక్షలు..

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

భైంసా పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. పెండింగ్ బిల్లుల విడుదలే ధ్యేయంగా సాగుతున్న ఈ నిరసన నేటికి విజయవంతంగా ఐదవ రోజుకు చేరుకుంది. వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు సుదీర్ఘ కాలంగా నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వారు కార్యాలయ ప్రాంగణంలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణ పురోగతి కోసం కోట్లాది రూపాయల సొంత నిధులను వెచ్చించి అప్పులు తెచ్చి మరీ నాణ్యతతో పనులను పూర్తి చేశామని తెలిపారు. పనులు పూర్తయి ఇన్నేళ్లు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కుటుంబాలను పోషించుకోలేక తాము మానసిక వేదనకు గురవుతున్నామని వాపోయారు. ఐదు రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్నప్పటికీ, మున్సిపల్ ఉన్నతాధికారులు కానీ, పాలకవర్గం కానీ కనీసం స్పందించకపోవడం, ఎలాంటి రాతపూర్వక హామీ ఇవ్వకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

**మహారాణా ప్రతాప్ యూత్ సంఘీభావం..**

కాంట్రాక్టర్ల న్యాయపోరాటానికి స్థానిక సంఘాల మద్దతు లభిస్తోంది. అందులో భాగంగా ఈరోజు మహారాణా ప్రతాప్ యూత్ సభ్యులు దీక్షా శిబిరాన్ని సందర్శించి కాంట్రాక్టర్లకు తమ పూర్తి సంఘీభావం ప్రకటించారు. యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ. సమాజ శ్రేయస్సు కోసం పనులు చేసిన కాంట్రాక్టర్లను ఇలా రోడ్డుపైకి తీసుకురావడం దురదృష్టకరమని ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్ బిల్లులన్నింటినీ ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంట్రాక్టర్లకు మద్దతుగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షా కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టర్లు స్థానిక నేతలు పాల్గొన్నారు.



# రైతు విద్యుత్ కష్టాలకు చెక్.. కౌకుంట్లకు ట్రాన్స్‌ఫార్మర్ల వరం!

- **నియోజకవర్గానికి 800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

రైతుల వ్యవసాయ అవసరాలకు నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, వైర్లు, విద్యుత్ పోల్స్ తదితర సామగ్రిని ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లకు పైగా నిధులు**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 1,000 రోజుల కాలంలో దేవరకద్ర నియోజకవర్గానికి రూ.1,000 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని జిఎంఆర్ వివరించారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు, కురుమూర్తి దేవస్థానం ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.110 కోట్లు, పల్లమరి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు రూ.43 కోట్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.75 కోట్లు, అజిలాపూర్ లిఫ్ట్‌కు రూ.32 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ముచ్చింతల-ఎర్నాల గేట్ బ్రిడ్జి, వడ్డేమాన్-ఇంటర్నేషనల్ స్కూల్ డబుల్ రోడ్డుకు రూ.54 కోట్లు, మూడు మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50 కోట్లు, దేవరకద్ర 100 పడకల ఆసుపత్రి, కొత్తకోట 30 పడకల ఆసుపత్రులకు రూ.41 కోట్లు, హ్యామ్ రోడ్లకు రూ.140 కోట్లు, వివిధ గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలకు రూ.73 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.175 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కోయిల్ సాగర్ వద్ద పర్యాటక అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

**రైతు సంక్షేమమే ధ్యేయం**

రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం తదితర సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

**రైతుల కోసం 800 ట్రాన్స్‌ఫార్మర్లు**

దేవరకద్ర నియోజకవర్గ రైతుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు 800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా, ప్రభుత్వం వెంటనే స్పందించి 800 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని జిఎంఆర్ తెలిపారు. మొదటి విడతలో దేవరకద్ర మండలానికి, రెండో విడతలో చిన్నచింతకుంట మండలానికి, మూడో విడతలో కౌకుంట్ల మండల రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తున్నామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వైర్లు, ఏబీ స్విచ్‌లు, పోల్స్ వంటి అవసరమైన విద్యుత్ సామగ్రిని కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే నియోజకవర్గ రైతులకు 1,000కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు.



**కౌకుంట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

గత ప్రభుత్వం కౌకుంట్లను నామమాత్రంగా మండలంగా ప్రకటించి నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కౌకుంట్ల మండలాన్ని గెజిట్‌లో చేర్చడంతో పాటు మండల కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కౌకుంట్లలో ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

**విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి 13 సబ్‌స్టేషన్లు**

దేవరకద్ర నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 13 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం తక్కువ వర్షపాతం, వాతావరణ పరిస్థితుల కారణంగా సెప్టెంబర్‌లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరగడంతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందన్నారు. రైతులు ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిరంతరం పనిచేస్తోందని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవన్ గూడలో ఘనంగా గణేషుడి ఆగమనం

- **భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు ప్రారంభం!**

**మొయినాబాద్, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం)**

మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు ఎన్కేపల్లి పరిధిలోని జీవన్ గూడలో గణేషుడి ఆగమనం మొదటిసారి అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగింది. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడి స్వామివారిని భక్తి శ్రద్ధలతో గ్రామంలోకి ఆహ్వానించారు. మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాల నడుమ సాగిన ఈ ఆగమన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసి, వినాయక ప్రతిష్టాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా భక్తులు ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు, విశేష సేవలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు, పెద్దలు, మహిళలు సైతం ఉత్సాహంగా పాల్గొని ప్రథమ పూజ్యుని ఆశీస్సులు అందుకున్నారు.



## సామ వెంకట్‌రెడ్డి నియామకమే చెల్లుబాటు..!!

- **అక్రమ ప్రొసీడింగ్స్‌తో గందరగోళం సృష్టించొద్దు..!!**
- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి.**
- **మండల అధ్యక్షుడిగా ఎప్పటికీ సామ వెంక రెడ్డి కొనసాగుతాడు.**
- **మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తలారి శేఖర్.**
- **వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ధారాసింగ్ ఆధ్వర్యంలోసామ వెంక రెడ్డి ఎన్నికయ్యారు.**
- **వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య.**

**నవాబుపేట సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం)**

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి తన నియామకమే చెల్లుబాటు అవుతుందని కాంగ్రెస్ పార్టీ నవాబుపేట్ మండల అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల అధ్యక్ష పదవికి సంబంధించి ఇటీవల జరుగుతున్న పరిణామాలు, కొందరు నాయకులు మీడియాకు ఇస్తున్న ప్రకటనలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్నానని తెలిపారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ పార్టీని వీడకుండా క్రమశిక్షణతో పనిచేశానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తనవంతు సహాయం చేస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నానని చెప్పారు. తన పార్టీ సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారాసింగ్ ఆధ్వర్యంలో తనను నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించారని తెలిపారు. తనకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారని, అందుకు సంబంధించిన పత్రం తన వద్ద ఉందని వెల్లడించారు. అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కొందరు వలస నాయకులు, అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లే విధంగా వ్యవహరిస్తూ మరో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి నియామక పత్రాలు తీసుకుంటున్నారని సామ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వికారాబాద్ జిల్లాకు సంబంధించిన మండల అధ్యక్ష నియామకంపై ఇతర జిల్లా నుంచి ప్రొసీడింగ్స్ తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తన నియామకంపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, పార్టీ అధిష్టానం ఇచ్చిన అధికారిక నియామక పత్రం ఆధారంగానే తాను బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలకు న్యాయం చేయాలని ఆయన అధిష్టానాన్ని కోరారు. ఈ సమావేశంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కావలి కొండల్ యాదవ్, ఉపాధ్యక్షులు దాన నర్సింలు, సంజీవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్, సర్పంచులు అంతగిరిపల్లి ప్రభాకర్, జామ జయయ్య, గాజులగూడెం నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి శేఖర్, నాయకులు భాగయ్య, దశరథ్, లక్ష్మణ్, ప్రభు, అశోక్, సురేష్ గౌడ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ.. నేడే తొలి పూజ

- **ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి**
- **పంచముఖ సంకటహర రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు**
- **మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం**
- **సోమవారం గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ**
- **ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు. ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు. ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



# చిత్తడిగా రోడ్డు.. నరకప్రాయంగా ప్రయాణాలు!

- **మున్సిపాలిటీలో విలీనమైనా మారని దుస్థితి**
- **కేసీఆర్ హయాం నాటి బీటీ రోడ్డే నేడు దిక్కు**
- **అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా మారిన వైనం**
- **ఎమ్మెల్యే రాకపోకలు సాగించినా పట్టించుకోని వైనం**
- **స్వయంగా గుంతల్లో మట్టి పోసుకుంటున్న జనం**
- **పాలకుల నిర్లక్ష్యంపై విమర్శలు గుప్పిస్తున్న వార్డు ప్రజలు**



**చేవెళ్ల, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారాల్సిన మున్సిపాలిటీలు నేడు పాలకుల ఉదాసీనతకు సజీవ సాక్ష్యాలుగా మారుతున్నాయి. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డు ప్రధాన రహదారి దుస్థితి ఇందుకు నిలువెత్తు నిదర్శనం. మున్సిపాలిటీలో విలీనం చేసి అద్భుతాలు సృష్టిస్తామని గొప్పలు చెప్పుకున్న నాయకుల మాటలు నేడు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గత గులాబీ ప్రభుత్వ హయాంలో అంటే 201516 సంవత్సరంలో ఈ మార్గానికి బీటీ రోడ్డు వేశారు. అప్పట్లో ఆ రోడ్డు వేయడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ఆనాడు కేసీఆర్ ప్రభుత్వంలో పడిన ఆ ఒక్క రోడ్డే నేటికి ఆ ప్రాంతానికి ఆఖరు వరం కావడం గమనార్హం అనంతరం కాలంలో అధికారం మారినా, పాలకులు మారినా దామరగిద్ద వార్డు రాత మాత్రం మారలేదు. ఆనాడు వేసిన బీటీ రోడ్డు కాలక్రమేణా పూర్తిగా ధ్వంసమై, ప్రస్తుతం అడుగుకో గొయ్యి ఏర్పడి కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నది. ఆకాశంలో చిన్న మబ్బు కనిపిస్తే చాలు... ఈ రోడ్డంతా కోనేరును తలపిస్తూ భయంకరమైన బురదమయంగా మారుతోంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు, పాదచారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు గుంతల్లో పడి కాళ్లు చేతులు విరకొట్టుకుంటున్నా, స్కూలు పిల్లలు బురదలో జారిపడుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికి తిరిగిన మాజీ ప్రజాప్రతినిధులు, గెలిచిన తర్వాత ప్రస్తుత కౌన్సిలర్ ప్రజల బాగోగులను గాలికొదిలేశారు. అధికారిక కార్యక్రమాల పేరుతో గౌరవ ఎమ్మెల్యే ఇదే రోడ్డు గుండా పలుమార్లు కాన్వాయ్‌లలో రాకపోకలు సాగించినప్పటికీ, ఈ నరకయాతన ఆయన కంటికి కనబడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన శూన్యం కావడంతో, విసిగిపోయిన స్థానిక కొంతమంది ప్రజలు నూతన ఇల్లు కట్టుకోడానికి పాత ఇంటిని కూల్చివేయడంతో అక్కడ ఉన్న బండరాళ్లు, మట్టిని గుంతలమయంగా ఉన్న రోడ్డుపై పోసి, చదును చేశారు. అయినా వర్షం పడిందంటే చిత్తడిగా బురదమయంగా మారుతుంది. దీంతో ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాలకుల వైఖరి ఇకనైనా మార్చుకోవాలని, ఇప్పటికైనా అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఈ ప్రధాన రహదారికి శాశ్వత మోక్షం కల్పిస్తూ కొత్త రోడ్డు నిర్మించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

-బేగరి అనిల్ బీఆర్ఎస్ నాయకులు



"గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2015-16 సంవత్సరంలోనే దామరగిద్ద వార్డులో బీటీ రోడ్డు వేయడం జరిగింది. ఆనాడు కేసీఆర్ పాలనలోనే గ్రామాలు, వార్డులు అన్ని విధాలా అభివృద్ధి చెందాయి. కానీ నేడు మున్సిపాలిటీలో విలీనం చేశామని గొప్పలు చెప్పకుంటున్న ప్రస్తుత పాలకులు, కనీసం ఆనాడు వేసిన రోడ్లకు మరమ్మతులు కూడా చేయించలేకపోతున్నారు. ఎమ్మెల్యే ఇదే మార్గంలో వెళ్తున్నా రోడ్డు కనిపించకపోవడం సిగ్గుచేటు. ప్రజలే స్వయంగా మట్టి పోసుకునే దుస్థితి తెచ్చిన ఈ ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారు.

### శాశ్వత రోడ్డు వేయండి

బోడ సామెల్ బీఆర్ఎస్ నాయకులు



"మున్సిపాలిటీలో కలిపిన తర్వాత ఈ ప్రాంతం మరింత అధ్వానంగా తయారైంది తప్ప ఎలాంటి అభివృద్ధీ జరగలేదు. దశాబ్ద కాలంగా ఏ ఒక్క కొత్త రోడ్డు వేసిన పాపాన పోలేదు. అధికారిక కార్యక్రమాల పేరుతో తిరిగే ఎమ్మెల్యేకు ఈ గుంతల రోడ్డు కంటపడకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరిచి తక్షణమే ఈ ప్రధాన రహదారికి శాశ్వత మోక్షం కల్పిస్తూ సీసీ రోడ్డు నిర్మించాలి.

### ప్రజల ప్రాణాలతో చెలగాటం

-చాకలి మల్లేష్ బీజేపీ యువనాయకులు

"చినుకు పడితే చాలు దామరగిద్ద ప్రధాన రహదారి కోనేరును తలపిస్తూ బురదమయంగా మారుతోంది. స్కూలు పిల్లలు, వృద్ధులు, వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయంతో వణికిపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తిరిగిన నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారు? అధికారులకు, స్థానిక పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువైంది. ఇప్పటికైనా అధికారులు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, దామరగిద్ద వార్డు కౌన్సిలర్, తాజామాజీ సర్పంచులు పరిశీలించి కనీసం రోడ్డుకు చిన్నపాటి మరమ్మత్తులైనా చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలి.




# తెలంగాణ సాయుధ పోరాటయోధుడు మఖ్దూమ్ మొహియుద్దీన్

నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి.

నిజాం నిరంకుశత్వానికి, భూస్వాముల దురాగతాలకు, రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మఖ్దూమ్ మొహియుద్దీన్. నిజానికి ఆయన ఉర్దూ కవి గానూ, ఉర్దూ అధ్యాపకుడు గానూ పేరు ప్రఖ్యాతులు గడించారు. హైదరాబాదు సంస్థానంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఆయన ఒకరుగా ఉన్నారు.

మఖ్దూమ్ మొహియుద్దీన్ 1908 ఫిబ్రవరి 4 నాడు జన్మించారు. ఆయన 1937లో ఎం.ఎ. డిగ్రీ పట్టా పొంది హైదరాబాద్ లోని సిటీ కాలేజీలో అధ్యాపక వృత్తిని చేపట్టి ఏడేళ్ల పాటు ఉర్దూ సాహిత్యాన్ని బోధించారు. మఖ్దూమ్ మొహియుద్దీన్ హైదరాబాద్‌లో ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్‌ను స్థాపించారు. 'శ్రామిక వర్గాల ఐక్యత ద్వారానే శ్రమదోపిడిని నిలువరించవచ్చు' అని నమ్మిన మఖ్దూమ్ మొహియుద్దీన్ 1930 లలో కామ్రేడ్స్ అసోసియేషన్‌లో చేరారు. ఆయన 1940 లో తన సహచరులతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) లో చేరాడు. మఖ్దూమ్ మొహియుద్దీన్ ఉర్దూ భాషా కవిగా ఒదిగి ఎదిగారు. జనం కష్టనష్టాలు ఆయన కవితల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన కవితల్లో విప్లవ జ్వాలలు ఎగిసిపడుతాయి. ఒకపక్క పీడిత ప్రజల్లో చైతన్యం రగిలిస్తూనే మరోపక్క ప్రజా పోరాటాల్లో ముందుండి ఉద్యమాలను నడిపించారు మఖ్దూమ్ మొహియుద్దీన్. 'విప్లవ కవి' ('షాయర్‌ఇఇంక్విలాబ్'') గా ఆయన పేరు గడించారు.

నిజాం రాచరిక దుర్మార్గ వ్యవస్థను మఖ్దూమ్ మొహియుద్దీన్ అడుగడుగునా ప్రశ్నించాడు. హైదరాబాద్‌లో కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన 'వెలుగురేఖ'గా ప్రసరించాడు. మఖ్దూమ్ మొహియుద్దీన్ హైదరాబాద్‌లో బలమైన కార్మిక వర్గ ఉద్యమాన్ని నిర్మించారు. చండ్ర రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, రాజ బహదూర్ గౌర్ లాంటి నాయకులతో కలిసి ఆయన పనిచేశారు.

'నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి ప్రజారాజ్య స్థాపన దిశగా ముందుకు సాగాలి' అని హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ స్టేట్ కమిటీ తీర్మానించడంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పిలుపు ఇవ్వగానే ప్రకటనపై సంతకం చేసిన వారిలో మఖ్దూమ్ మొహియుద్దీన్ ఒకరుగా ఉన్నారు. ఆయన రాసిన 'హైదరాబాద్ 1946' అనే అనే కవిత తెలంగాణ సాయుధ పోరాటానికి సమరశంఖారావాన్ని రగిలించింది.

తెలంగాణ సాయుధ పోరాటానికి మద్దతుగా హైదరాబాద్ నగరంలోని కార్మికులను ఏకం చేయడంలో మఖ్దూమ్ మొహియుద్దీన్ సఫలీకృతులయ్యారు. పోరాటం ఉధృతంగా కొనసాగుతూ ముందుకు దూసుకెళ్తున్న క్రమంలో దానిని సహించని నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆయనను పట్టుకున్న వారికి భారీ బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఆ సమయంలో మఖ్దూమ్ మొహియుద్దీన్ అజ్ఞాతంలోకి వెళ్ళి అక్కడి నుండే గెరిల్లా దళాలకు దిశా నిర్దేశం చేశారు.



సాయుధ పోరాటం ముగిశాక మఖ్దూమ్ మొహియుద్దీన్ హైద్రాబాద్ రాష్ట్ర శాసనసభ్యుడు గానూ, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు గానూ పనిచేశారు. 1969 లో ఆయనకు ఉర్దూలో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మఖ్దూమ్ మొహియుద్దీన్ గౌరవార్థం హైదరాబాద్ లోని కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి 'మఖ్దూమ్ భవన్' అని నామకరణం చేశారు. గత సంవత్సరమే ఆ భవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దారు.

'సమసమాజం సాక్ష్యాత్కరించబడి నూతన సమాజం ఆవిష్కరించబడాలి' అని మఖ్దూమ్ మొహియుద్దీన్ పరితపించారు. ఆయన అతి సాధారణమైన జీవితాన్ని గడిపారు. చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం మఖ్దూమ్ మొహియుద్దీన్ అవిశ్రాంతంగా ఉద్యమించారు. ఆయన 1969 ఆగస్టు 25 నాడు ఢిల్లీలో నిర్వహిస్తున్న కవి సమ్మేళనంలో గుండెపోటుతో మరణించారు. ఆయన మరణించినను ఆయన చేసిన పోరాటాలు నిప్పురవ్వలా ఎగిసిపడుతూ పీడిత ప్రజానీకంలో సజీవంగా వెలుగొందుతూనే ఉంటాయి.



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్:94933 19690

# అమ్డాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- **సర్పంచ్ మధ్యపాగ కృష్ణ**

**మొయినాబాద్, సెప్టెంబర్ 13(ప్రజాక్షేత్రం):**

అమ్డాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ మధ్యపాగ కృష్ణ స్పష్టం చేశారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడమే తమ లక్ష్యమని, గ్రామంలో కరెంట్ కోతలు, లోవోల్టేజ్, ఫ్యూజులు ఎగిరిపోయే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రతీ సమస్యను పరిష్కరిస్తూ, అంచలంచెలుగా గ్రామాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని సర్పంచ్ కృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# గలీజ్ మాటలు అన్నారు..



'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు.

అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.




ప్రముఖ వ్యాపారవేత్త, రామ్ చరణ్ సతీమణి ఉపాసన (Upasana) తన ఫిట్‌నెస్ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. 18ఏళ్ల వయసులోనే ఆమె 95 కిలోల బరువు ఉండేవారట. చరణ్‌తో పెళ్లి సమయంలోనూ తను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "అమెరికాలో చదువుకునే రోజుల్లో కుటుంబానికి దూరంగా ఉండటం వల్ల బెంగగా ఉండేది. ఆ ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఎక్కువగా తినేదాన్ని. దానివల్లే 18 ఏళ్ల వయసులో 95 కిలోల బరువు పెరిగా. ఆ తర్వాత బరువు తగ్గేందుకు చాలామంది డైటీషియన్లను కలిశా. రకరకాల డైట్లు ప్రయత్నించా. చివరికి అన్నం, గోధుమలకు బదులుగా ఓట్స్, హై ప్రొటీన్ ఆహారం తీసుకోవడం వల్ల మంచి ఫలితం కనిపించింది. కాలేజీకి నడుచుకుంటూనే వెళ్లేదాన్ని. అలా రోజూ 10 వేల అడుగులు నడవడం అలవాటు చేసుకున్నా"

"చరణ్ (Ramcharan)తో వివాహం జరిగిన సమయంలోనూ నా బరువుపై బాగా కామెంట్లు వచ్చాయి. 'చరణ్‌కు ఆమె తగిన జోడీ కాదు.. చాలా లావుగా ఉంది' అంటూ కొందరు కామెంట్లు చేశారు. మొదట్లో ఆ మాటలకు చాలా బాధపడేదాన్ని. కానీ, ఆ తర్వాత వాటి వల్లే మానసికంగా దృఢంగా మారాను. నా వాళ్లు ఏమనుకుంటున్నారు అనేది మాత్రమే నాకు ముఖ్యం. విమర్శలను పట్టించుకోకుండా వాటిని ఎలా ఎదుర్కోవాలో ఇప్పుడు బాగా తెలిసింది" అని ఉపాసన పేర్కొన్నారు.

## నేనూ బాడీ షేమింగ్ ఎదుర్కొన్నా.. బరువు ఎలా తగ్గానంటే?

# అట్లీతో సినిమా సన్నాహాల్లో షారుక్?

'కింగ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొణె కథానాయిక. డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత షారుక్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటి వరకూ ఎలాంటి కొత్త కబురు వినిపించనే లేదు. ఈ నేపథ్యంలోనే ఆయన.. దర్శకుడు అట్లీ కాంబోలో వచ్చిన 'జవాన్' చిత్రానికి సీక్వెల్ వస్తుందని గతంలో వార్తలొచ్చాయి. అయితే తాజాగా వీరిద్దరూ మరో కొత్త ప్రాజెక్ట్ కోసం చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ జోరునే కొనసాగిస్తూ వీళ్ల కాంబోలో మరో చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.



# అయినా కల నెరవేరలేదనిపిస్తుంది

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఎన్నో భాషల్లో విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు ప్రముఖ నటుడు మురళీ శర్మ (Murali Sharma). ఇటీవల ఆయన 'సూపర్ సుబ్బు' వెబ్ సిరీస్‌తో డిజిటల్ రంగంలోకి (ఓటీటీ) అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా కథ రాసే విధానంలో నాణ్యత బాగా పెరిగింది. ఒక సినిమాకు కథే ప్రాణం. నేను ఇప్పటి వరకు 250కి పైగా చిత్రాల్లో నటించానంటే నాకే నమ్మశక్యంగా లేదు. అయినా నా కల నెరవేరలేదనిపిస్తుంది. ఎందుకంటే, కెరీర్ ప్రారంభంలో ఇంత స్థాయిలో ఎదుగుతానని అనుకోలేదు. అంత పెద్ద కల కనే ధైర్యం కూడా చేయలేదు'' అని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు. సినిమాల్లో పాత్ర నిడివి గురించి తానెప్పుడూ ఆలోచించనని మురళీ శర్మ స్పష్టం చేశారు. ''ఇచ్చిన పాత్రకు ఎంత వరకు న్యాయం చేశాననేదే నాకు ముఖ్యం. సినిమాలో నా పాత్ర నిడివి ఎంత ఉందనేది ఎప్పుడూ చూడలేదు. అదృష్టవశాత్తూ నా సినీ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యభరిత పాత్రలు దక్కాయి. తెలుగులో నన్ను తండ్రి పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తుంటారు. అయితే, నేను ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తున్నానని ఫీల్ కాలేదు. దర్శకుడు నాకు ఏ పాత్ర ఇచ్చినా దానికి వంద శాతం న్యాయం చేయడమే నా బాధ్యతగా భావిస్తాను'' అని ఆయన వివరించారు.





## డిమాండ్ చేస్తే యాక్షన్‌కీ వెనకాడను!

"అడుక్కునే వాళ్లకి కూడా ఆదివారం ఉంటుంది కానీ ఈ అప్పుల వాళ్లకి ఉండదు" అంటున్నారు చిట్టిబాబు. మరి ఆయనెవరు.. తన కుటుంబ కథేంటి? తెలియాలంటే 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చూడాల్సిందే. వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

"డబ్బుకీ.. సబ్బుకీ ఓ పోలికుంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది. రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది" అంటూ చిట్టిబాబుగా వెంకీ చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం అలరించేలా సాగింది. సగటు మధ్యతరగతి ఉద్యోగిగా చిట్టిబాబు జీవితాన్ని.. భార్య చేసే అప్పుల వల్ల తను పడే తిప్పల్ని ఈ ప్రచార చిత్రంలో ఫన్నీగా చూపించారు. వాళ్లంతా అకస్మాత్తుగా ఒక్కరాత్రిలో ధనవంతులుగా మారడం.. దానివల్ల ఆ కుటుంబానికి ఎదురైన చిక్కులు.. అందులో నుంచి బయట పడేందుకు భార్యాబిడ్డలతో కలిసి చిట్టిబాబు చేసిన సాహసాలు టీజర్‌లో ఆసక్తిరేకెత్తించాయి.

"నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని నాకు తెలుసు. కానీ, సిట్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనకాడను" అంటూ వెంకీ చేసిన యాక్షన్ హంగామా ఆకట్టుకుంది. "నది గట్టు దాటితే వరదంటారు. అదే సముద్రం దాటితే ఉప్పెనంటారు. కానీ, సామాన్యుడు దాటితే.! బలమైన పదం.. స్ట్రాంగ్ సౌండ్ వచ్చేది మీరే వెతకండి సర్" అంటూ ఆఖర్లో ఓ పోలీసుతో వెంకటేశ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: రవి కె చంద్రన్.

# కాకా.. ధూమ్ ధమాకా!

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు.

''కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక'' అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.



## టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో...డోరతి

కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'డోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం.

ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'డోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన డోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394